క్లుప్తంగా

కాంగ్రెస్ ఎస్సీ సెల్‌లో నియామకాలు


నియామకపత్రం అందజేస్తున్న రాంరెడ్డి

చైతన్యపురి: కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా కె.నవీన్‌కుమార్, బీఎన్‌రెడ్డి డివిజన్ అధ్యక్షుడిగా కె.నర్సింగ్‌రావు నియమితులయ్యారు. రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బి.రాజ్‌కుమార్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేయగా.. వారికి ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ ఎల్‌బీనగర్ అధ్యక్షుడు బి.రాజశేఖర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నాసిరకం పనులు చేస్తే సహించేది లేదు


హుడా సాయి నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నాసిరకం పనులు చేస్తే సహించేది లేదని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని హుడా సాయి నగర్ కాలనీలో నిర్మాణం జరుపుకుంటున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత సరైన క్యూరింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు.

ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి జయంత్యుత్సవాలు


లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: కొత్తపేట పరిధి ఫణిగిరి కాలనీలోని కోసగుండ్ల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో గురువారం లక్ష్మీ నరసింహ స్వామి జయంత్యుత్సవాలు, కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తోట మహేష్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మిర్యాల నర్సింహారెడ్డి, ప్రభు, జలంధర్, గణేష్, నర్సింహులు, ఆలయ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


జడ్జి డా. పట్టాభి రామారావును సన్మానిస్తున్న సొసైటీ సంచాలకుడు, ఉపాధ్యక్షురాలు

రంగారెడ్డి కోర్టులు: జిల్లా కోర్టుకు ఇటీవల బదిలీపై వచ్చిన మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డాక్టర్ పట్టాభి రామారావును రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాద పరస్పర సహకార సంఘం సంచాలకుడు డా.బాచిరెడ్డి శాయి రెడ్డి, సంఘం ఉపాధ్యక్షురాలు సునీత బర్ల గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సొసైటీ అందిస్తున్న సేవలను న్యాయమూర్తికి క్లుప్తంగా వివరించగా, సొసైటీ సేవలను న్యాయమూర్తి ప్రశంసించారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట 11, వంకాయ 18, బెండ 35, పచ్చి మిర్చి 40, కాకర 32, బీర 40, క్యాబేజీ 15, ఫ్రెంచిబీన్స్ 85–135, క్యారెట్ 28, దొండ 23–28, చిక్కుడు 50, గోకర 50, బీట్‌రూట్ 20, క్యాప్సికం 40, ఆలు 19, దోస 15, సొర 9, పొట్ల 15, ఉల్లి 14 చామగడ్డ 35. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

పూడిక తీసి ప్రయోజనమేంటీ?

- డ్రైనేజీ వ్యర్థాలు తీసి రోడ్డుపై వేస్తున్న జలమండలి సిబ్బంది
- ఆ మట్టితో రాకపోకలకు ఇబ్బంది
- దుర్వాసనతో స్థానికుల అగచాట్లు
- వర్షానికి కరిగి మళ్లీ మ్యాన్‌హోళ్లలో చేరుతున్న పూడిక మట్టి


రాజీవ్‌గాంధీనగర్‌లో పొంగుతున్న డ్రైనేజీ


రాజీవ్‌గాంధీనగర్‌లో రోడ్డుపై నుంచి తొలగించని పూడిక మట్టి

నాగోలు: ఎల్‌బీఆర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ బస్తీలు, మురికివాడల్లో తరచూ డ్రైనేజీ సమస్యలు ఎదురవుతున్నాయి. డ్రైనేజీ నీరు సజావుగా వెళ్లేందుకు మ్యాన్‌హోళ్ల నుంచి వ్యర్థాలు, పూడిక మట్టి (సిల్ట్)ని తొలగిస్తున్న జలమండలి సిబ్బంది దానిని అక్కడే రోడ్డు పక్కన వేస్తున్నారు. ఆ వ్యర్థాలను తొలగించపోవడంతో రోజుల తరబడి అక్కడే ఉండిపోతున్నాయి. దీంతో కాలనీవాసుల రాకపోక లు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ విషయంపై జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఒకపక్క రోడ్లపై ఉన్న పూడిక మట్టితో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడటమే కాకుండా దుర్వా సనతో అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా వర్షాలకు రోడ్డు పై ఉన్న పూడిక మట్టి కరిగిపోయి మళ్లీ మ్యాన్‌హోళ్లలోకి చేరుతోంది. ఫలితంగా మళ్లీ పైపులు పూడిక పోయి మురుగు ముందుకు సాఫీగా వెళ్లక మ్యాన్‌హోళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపై ఏరులై పారుతుండటంతో పాదచారులే కాకుండా ద్విచక్రవాహనదారులు కూడా ఇబ్బంది పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.
- కొత్తపేట డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్ కాలనీ, కొత్తపేట బస్తీ, మోహన్ నగర్, గుంటి జంగయ్య నగర్ కాలనీ, అంబేడ్కర్‌నగర్, శివమ్మనగర్, ఎల్‌బీనగర్ మసీద్ గల్లీ, ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీ, న్యూనాగోలు కాలనీ తదితర ప్రాంతాలతో పాటు బస్తీలు మురికి వాడల్లో తరచూ డ్రైనేజీ సమస్యలు ఎదురవుతున్నాయి.
- రహదారులపై పొంగి ప్రవహించనప్పుడు మురికినీరు సజావుగా వెళ్లడానికి పైపుల నుంచి బయటకు తీసిన వ్యర్థాలు మట్టికుప్పలను డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల వద్ద కుప్పలుగా పోస్తున్నారు. తరువాత మట్టి తొలగించడం తమ పని కాదన్నట్లు జలమండలి అధికారులు వ్యవహరిస్తున్నారు.
- గతంలో వేసిన పాత డ్రైనేజీ పైపులతో పెరిగిన జనాభా అనుగుణంగా జలమండలి పునర్వ్యవస్థీకరణ, డ్రైనేజీ వ్యవస్థ అధునికీకరణ జరగలేదు. దీంతో ప్రజలకు మురుగు ఇబ్బందులు తప్పడం లేదు.
- ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి డ్రైనేజీ పొంగుతున్న కాలనీలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని, కాలనీలో రోడ్లపై నుంచి డ్రైనేజీ వ్యర్థాలను వెంటనే తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పూడిక కరిగి మళ్లీ సమస్య



కొత్తపేట డివిజన్ పరిధిలో భరత్‌నగర్ కాలనీ, రాజీవ్ గాంధీనగర్ బస్తీల్లో డ్రైనేజీ వ్యర్థాలను మ్యాన్‌హోల్ నుంచి తీసి మట్టికుప్పలను పక్కనే వేస్తారు. దానిని తొలగించకపోవడంతో వర్షాలు వచ్చినప్పుడు తిరిగి డ్రైనేజీ పైపుల్లోకి చేరుతోంది. దీంతో డ్రైనేజీ సమస్య పునరావృతమై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

– స్వామి, భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

మలక్‌పేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తీగల సునరితాఅజీత్‌రెడ్డితో కలిసి గురువారం మూసారంబాగ్ డివిజన్‌లోని కాలనీలలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కుల, మతాలకు అతీతంగా ప్రజా సమస్యలు పరిష్కారమే పరమావధిగా పని చేస్తున్నామన్నారు. రూ. 2 కోట్ల 56 లక్షలతో మూసారంబాగ్‌లో సీసీ, బీటీ రోడ్లు, బాక్స్ డ్రెయిన్, వాటర్ పైప్‌లైన్ పనులు చేపట్టామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి, మజ్లిస్‌నేత రవీందర్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, నాగయ్య, సోమయ్య, అభిషేకం, పవన్, రమేష్, వెంకన్న, నాగరాజు, లక్ష్మి, ఇలియాస్, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, విద్యుత్‌శాఖ, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.


వాటర్ పైప్‌లైన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

బస్తీ నాయకులపై ఎమ్మెల్యే ఆగ్రహం..

బస్తీ నాయకుడు నల్లా కనెక్షన్ ఇప్పిస్తామని డబ్బులు తీసుకున్నారని, ఇంతవరకు కనెక్షన్ ఇవ్వలేదని శాలివాహన నగర్‌లో నాగరాజు అనే వ్యక్తి ఎమ్మెల్యే బలాలకు ఫిర్యాదు చేశారు. సంబంధిత వ్యక్తిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరాలను ఆసరాగా చేసుకుని డబ్బులు తీసుకుని పేదలను ఇబ్బందులు గురిచేస్తే సహించబోమని హెచ్చరించారు. ఎవరూ కూడా మధ్యవర్తులను ఆశ్రయించవొద్దని, సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకరావాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కొందరు వ్యక్తులు ఇళ్ల స్థలాలు కూడా ఇప్పిస్తామని డబ్బులు తీసుకున్నారని స్థానికులు తెలిపారు.

ప్రియాంక గాంధీ సభను జయప్రదం చేయాలి

చైతన్యపురి: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం మైదానంలో ఈనెల 8న ప్రియాంకగాంధీ పాల్గొనే విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్ సభను జయప్రదం చేయాలని చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండ సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లో ఆయన ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ కోసం 12 వందల మంది విద్యార్థుల బలిదానాలను చూడలేక సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ మాయమాటలు చెప్పిన కేసీఆర్ తాను అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చేసి ప్రియాంక గాంధీ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్‌చారి, శరత్‌రెడ్డి, మహేష్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, రమణ, శివ, నర్సింహ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

ప్రొఫెసర్ కోదండరామ్ అరెస్టు అప్రజాస్వామికం

టీజేఎస్ నాయకురాలు పుష్పనీల



మన్సూరాబాద్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సెక్రటేరియట్‌లోని సెక్రటరీకి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్‌ను అక్రమంగా అరెస్టు చేయటం అప్రజాస్వామికమని టీజేఎస్ మహిళా విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్తూరి పుష్పనీల ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎల్‌బీనగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ఏమిటని మండిపడ్డారు. రాష్ట్రంలో రాచరికపు పాలన సాగుతోందని ఆరోపించారు. నిజంగా కేసీఆర్ సర్కార్‌కు రైతులపై ప్రేమ ఉంటే నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన టీజేఎస్ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి


ఉప్పల శ్రవణ్‌కుమార్ గుప్తాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో శ్రమశక్తి అవార్డు అందుకున్న బీఆర్‌టీయూ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్మిక విభాగం ఇన్‌చార్జ్ ఉప్పల శ్రవణ్ కుమార్ గుప్తాను గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్కూల్ వ్యాన్ యూనియన్ జనరల్ సెక్రెటరీ రవీందర్ రెడ్డి, టీఆర్‌ఎస్ కేవీ స్టేట్ సెక్రటరీ మహేష్ దేశ్పాక్, బీఆర్‌టీయూ నాయకుడు జిల్లా శ్రీనివాస్, నాయకులు తిలక్ రావు, పార్శపు శ్రీధర్, మధుసాగర్, ప్రకాష్, రవి, నరేష్ పాల్గొన్నారు.

ఎల్బీనగర్ పోలీసు అధికారుల కొత్త ఫోన్ నంబర్లు

నాగోలు: ప్రభుత్వం పోలీసు శాఖలోని అన్ని విభాగాల ఫోన్ నంబర్లను ఇటీవల మార్చింది. ఇందులో భాగంగా ఎల్‌బీనగర్ పరిధిలోని పోలీసు అధికారుల ఫోన్ నంబర్లు కూడా మారాయి. కొత్తగా కేటాయించిన నంబర్లు ఇలా ఉన్నాయి.

అధికారి	ఫోన్ నం.
ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ,	8712662003
ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి	8712662029
ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి	8712662304
క్రైమ్ సీఐ ఉపేందర్‌రావు	8712662311
అడ్మిన్ ఎస్‌ఐ రాంబాబు	8712662312
ఎస్‌ఐ రవికుమార్	8712662313
ఎస్‌ఐ నాగరాజు	8712662314
ఎస్‌ఐ దయాకర్‌రెడ్డి	8712662315
ఎస్‌ఐ శంకర్	8712662317
ఎస్‌ఐ ఉషా శంకర్	8712662318
ఎస్‌ఐ మధు	8712662319
క్రైమ్ ఎస్‌ఐ నరేందర్	8712662320
ఎస్‌ఐ ప్రభు లింగం	8712662321

పకడ్బందీగా వెరిఫికేషన్ చేయండి

బీఎల్‌ఓలకు డీసీ ఆదేశాలు


జయంత్, మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్

చాదర్‌ఘాట్: ఓటరు నమోదుకు సంబంధించిన వెరిఫికేషన్ (సర్వే)ను పకడ్బందీగా చేయాలని మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. గురువారం సర్కిల్–6 కార్యాలయంలో మాట్లాడుతూ, రానున్న పది రోజుల్లో బీఎల్‌ఓలకు కేటాయించిన నివాసాలను మరోసారి వెరిఫికేషన్ చేయాలని ఆయన సూచించారు. ఒకేఫొటో కలిగి రెండు మూడు ఓట్లు కలిగిన వారిని గుర్తించి అందులో సరైన వాటిని ఉంచి మిగతా వాటిని తొలగించేందుకు డిక్లరేషన్లు తీసుకోవాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఒకే ఇంట్లో ఆరుకు పైగా ఓట్లు ఉంటే అవి నిజమైనవా కాదా, ఆ ఓటర్లు ఇక్కడే ఉంటున్నారా, అందులో ఏమైనా బోగస్ ఉన్నాయా లేదా గుర్తించి వెంటనే డీసీకి తెలపాలన్నారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించడంతో పాటు వేరే ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగి ఉంటే వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. చాలా నెలలుగా ఎక్కువమంది ఆన్‌లైన్‌లో తమ ఓటు నమోదు చేసుకోవటానికి ఆసక్తి చూపుతున్నారని, అలా ఏప్రిల్ 30 తేదీ వరకు ఎవరైతే ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారో గుర్తించి వారి నివాసాలకు వెళ్లి వెరిఫికేషన్ చేసి ఓటరు నమోదుకు అవకాశం కల్పించాలని సూచించారు.

రూ.5 లక్షల బీమాపై హర్షం


సీఎం కేసీఆర్, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గీత కార్మికులు

మీర్‌పేట: గీత కార్మికులకు రూ.5 లక్షల బీమా అందజేస్తామనడంపై హర్షం వ్యక్తం చేస్తూ మీర్‌పేట జిల్లెలగూడలో గౌడ సంఘం నాయకులు గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరణించిన గీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబీమా వలె గీత బీమాను ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. దీంతో పాటు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో వైన్ షాపుల్లో గీత కార్మికులకు రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. కార్యక్రమంలో భిక్షపతిగౌడ్, బాలకృష్ణగౌడ్, మల్లేష్‌గౌడ్, మురళీగౌడ్, యాదయ్యగౌడ్, రాహుల్‌గౌడ్, మహేందర్‌గౌడ్, సత్తయ్యగౌడ్, నర్సింహగౌడ్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, హెల్త్‌కిట్ల పంపిణీ

మలక్‌పేట: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ జన్మదినాన్ని గురువారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మలక్‌పేట ఫిన్ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు సంతోష్‌కుమార్ బధిర విద్యార్థులకు పండ్లు, హెల్త్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంజన్ కుమార్ పది కాలాల పాటు ప్రజాసేవలో విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సీహెచ్ వెంకటేష్, శశాంక్‌సాయి, మారుతి, సతీష్, దిలీప్, వంశీసాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి తిరు కల్యాణోత్సవం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని మత్స్యావతార వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరు కల్యాణోత్సవం ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ సంజయ్ గోపాల్‌సైంచర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్త యాదగిరి ముదిరాజ్, భక్తులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న చైర్మన్ సంజయ్‌గోపాల్ దంపతులు

మహేశ్వరంలో బీజేపీ విజయం ఖాయం


మాట్లాడుతున్న బండి సంజయ్

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

మహేశ్వరం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ జన్మదినం సందర్భంగా తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి బాలాపూర్ చౌరస్తా, బడంగ్‌పేట్, నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనకు అంతిమ ఘడియలు మొదలయ్యాయని, ప్రజల్లో బీఆర్‌ఎస్‌పై నమ్మకం పోయిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతి నాయకుడు, కార్యకర్త పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఉచిత ఆరోగ్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ శర్మ, బోసుపల్లి ప్రతాప్, సామల రంగారెడ్డి, ఎల్మటి దేవేందర్ రెడ్డి, ధీరజ్‌రెడ్డి, మధుమోహన్, మంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం


భువనగిరికి బదిలీ అయిన డిస్ట్రిక్ లీగల్ సెల్ అథారిటీ మెంబర్ సెక్రటరీ మురళీ మనోహర్‌ను సత్కరించిన జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా రజా అలీ బేగ్, సిబ్బంది.
–సైదాబాద్

నిజమైన 'సేవే'నా?

- అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాల పేరిట కాలనీల్లో వసూళ్లు
- ఈ సంస్థలు అసలువా, నకిలీవా తెలియక ప్రజల అయోమయం

వనస్థలిపురం: అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు, వైద్యం కోసం అంటూ కొందరు కాలనీల్లో డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. పలు సంస్థలు తమ సిబ్బందిని రంగంలోకి దించి యథేచ్ఛగా కాలనీల్లో చందాలు వసూలు చేయిస్తున్నాయి. ఉదయం లేచింది మొదలు.. రాత్రి వరకు ఆటోలకు బ్యానర్లు కట్టుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. అయితే వీటిలో నిజంగా సేవ చేసే సంస్థలు ఏవి, వసూళ్లకు పాల్పడే నకిలీ సంస్థలు ఏవో తెల్సుకోలేక కాలనీల ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

అనాథలు, వృద్ధుల కోసమంటూ..

పేదవారు, ఎవరు లేని అనాథలు, వృద్ధుల కోసం చీరలు, ప్యాంట్లు వంటి పాత బట్టలు, బియ్యం, ధన సహాయం చేయాలంటూ ఇటీవల కాలంలో పలు సంస్థల ప్రతినిధులు కాలనీల్లో తచ్చాడుతున్నారు. రోడ్డున పోయేవారిని, ప్రతి ఇంటికీ తిరుగుతు సేవా కార్యక్రమాల పేరిట చందాలు వసూలు చేస్తున్నారు. పలు చోట్ల ఆటోల్లో తిరుగుతూ వసూళ్ల దందా కొనసాగిస్తున్నారు. సేవా కార్యక్రమాలకు డబ్బులు ఇస్తే పుణ్యం వస్తుందని చాలా మంది వీరికి తోచినంత ఆర్థిక సాయం, బట్టలు, బియ్యం వంటివి విరాళంగా అందజేస్తున్నారు. అయితే తాము అందజేసిన వస్తువులు, డబ్బులు నిజంగా సేవా కార్యక్రమాలకు ఉపయోగపడుతున్నాయా, లేక స్వార్థపరుల చేతుల్లోకి వెళ్తున్నాయా అనే సందేహం చాలా మందికి కలుగుతోంది. అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు నడుపుతున్నామని చెపుతున్న వ్యక్తులకు ఇలా ఇళ్లు, వాడలు తిరుగుతు భిక్షాటన చేయడానికి ప్రభుత్వం అనుమతులు ఇస్తుందా అని వారు ప్రశ్నిస్తున్నారు. పలువురు తాము సేకరించిన దుస్తులు, బియ్యం తదితర సామగ్రిని బయట అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారనే అనుమానాలను కాలనీ వాసులు వ్యక్తం చేస్తున్నారు.

గుళ్లు, ఆవుల పేరుతో వసూళ్లు...

పలు ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు సాయిబాబా ఫొటోలు పెట్టుకుని ఎక్కడో గుడి కడుతున్నామంటూ వాహనాలపై తిరుగుతూ చందాలు వసూలు చేయడం సర్వసాధారణమై పోయింది. అంతేకాకుండా కొందరు ఆవులను ఆలయాల వద్ద, కాలనీల్లో తిప్పుతూ భిక్షాటన చేస్తున్నారు. భిక్షాటన పేరుతో కాలనీల్లో ఇళ్లను పరిశీలించి వెళ్తున్నారని కాలనీ వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలా విచ్చలవిడిగా అపరిచితులు కాలనీల్లో తిరగడం ఆందోళన కలిగిస్తోందని, ఈ విషయంలో పోలీసులు, మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.


ఓ సంస్థ బ్యానర్లతో కాలనీల్లో తిరుగుతున్న ఆటో

చందాల వసూళ్లు, భిక్షాటనపై నియంత్రణ ఉండాలి



ఛారిటీ సంస్థల పేరుతో పలువురు కాలనీల్లో తిరుగుతూ డబ్బులు, బియ్యం, దుస్తులు, ఆహార సామగ్రి సేకరిస్తున్నారు. అందులో అసలు ఎవరో, నకిలీలు ఎవరో తెలియని పరిస్థితి ఉంది. ఈ విషయంలో పోలీసు, మున్సిపల్ అధికారులు, సంస్థలను రిజిస్ట్రేషన్ చేసే శాఖ అధికారులు గానీ తగిన చర్యలు తీసుకోవాలి. భిక్షాటన ద్వారా వసూళ్లకు పాల్పడే సంస్థలను నియంత్రించాలి.
–కేఎల్ నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి, శారదానగర్